క్లుప్తంగా

పట్టణంలో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న మహిళలు, భక్తులు

ఏలేశ్వరం: ధనుర్మాసం పురస్కరించుకుని పట్టణంలో గురువారం తెలవారు జామున నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన భజంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో దిబ్బలపాలెంలోని కోదండ రామాలయం నుంచి పురవీధుల్లో భజన గీతాలు ఆలపిస్తూ మహిళలు, భక్తులు నగర సంకీర్తన చేశారు. భజనబృందాల నేతృత్వంలో మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పైల విజయ్‌కుమార్, గూనాపు అశోక్, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భాస్కరబాబుకు నివాళి



భాస్కరబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించిన మురళీకృష్ణంరాజు

రౌతులపూడి: ఇటీవల బలరామపురంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర వెంకన్నదొర(భాస్కర బాబు) చిత్రపటానికి ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు మురళీకృష్ణంరాజు నివాళులు అర్పించారు. బుధవారం భాస్కరబాబు స్వగృహంలో జరిగిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర బాబు కుమారుడు రాజాను, కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, మాగపు శివ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా ఊటా వీరబాబు



ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామానికి చెందిన ఊటా వీరబాబు బీజేపీ మండల అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు మార్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం వీరబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడుగా ఎన్నుకున్న పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

జగ్గంపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తే, వారు జాతీయ స్థాయిలోను రాణిస్తారని, వారిని ప్రోత్సహించేందుకు పోలీసులు సాంప్రదాయ క్రీడలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన సాంప్రదాయ క్రీడలను ఆయన ప్రారంభించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, కిర్లంపూడి, గండేపల్లి ఎస్సైలు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో ధర్నా



అవంతి కంపెనీ వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు



మృతురాలు జామి మహాలక్ష్మి (ఫైల్)

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలోని అవంతి ఫ్రోజెన్ ప్రైవేట్ కంపెనీ వద్ద గురువారం మృతదేహంతో బంధువులు ధర్నా నిర్వహించారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మహిళ బలైందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామానికి చెందిన జామి మహాలక్ష్మి(32) కొంత కాలంగా కంపెనీలో పని చేస్తోంది. గత నెల 31న మధ్యాహ్న భోజన విరామ సమయంలో కుప్పకూలి పడిపోయింది. తోటి సిబ్బంది గుర్తించి యాజమాన్యానికి తెలియజేయగా రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా మహాలక్ష్మి మృతి చెందిందని బంధువులు ఆందోళన నిర్వహించారు. యాజమాన్యం బంధువులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

అంతా అనుకూలిస్తే..

- నెరవేరనున్న పని దినాల లక్ష్యం
- నెమ్మదిగా సాగుతున్న ఉపాధి పనులు
- ఈ నెలాఖరుకు పుంజుకోనున్న హాజరు
- వందరోజులు పూర్తి చేసింది 402 మందే
- పనుల్లో పాల్గొంది 33 శాతం కుటుంబాలే



హెచ్.కొత్తూరులో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న పశువుల షెడ్డు

తుని రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం మూడు నెలల్లో ముగియనున్నప్పటికి పనుల్లో వేగం పుంజుకోలేదు. దీంతో లక్ష్యాలను చేరుకుంటామా లేదా అనే సందేహం అధికారుల్లో నెలకొంది. తుని నియోజకవర్గం మూడు మండలాల్లో గడచిన తొమ్మిది నెలల నుంచి నెమ్మదిగా జరుగుతున్న ఉపాధి పనుల్లో 33 శాతం కుటుంబాలు పాల్గొన్నాయి. పని దినాల లక్ష్యం నెరవేరుతుందా లేదా అనే సందేహం ఉన్నత అధికారులలో ఏర్పడింది. సంక్రాంతి పండగ పర్వదినాలు ముగిస్తే వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయని, అప్పుడు కూలీల సంఖ్య గరిష్ట స్థాయికి చేరడంతో పనిదినాల లక్ష్యం సులభంగా అధిగమిస్తామని క్షేత్రస్థాయి సిబ్బంది పేర్కొంటున్నారు. 16 లక్షలకుపై పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 9.32 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. 402 కుటుంబాలు వంద రోజుల పని దినాలు పూర్తి చేశాయి. వేల సంఖ్యలో జాబ్ కార్డులు, కూలీలు ఉన్నప్పటికి ప్రస్తుతం వందల సంఖ్యలోనే పనులకు హాజరవుతున్నారు. వరి, మొక్కజొన్న తదితర పంట కోతలు, సంక్రాంతి పండగ సెలవులు కారణంగా ఈ నెల నాలుగో వారం వరకు పనులు కూలీలు వచ్చే సూచనలు కనిపించడంలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 4513 పనులు చేసేందుకు అనుమతి లభించగా అందులో 3032 పనులు చేపట్టారు. 9.32 లక్షల పని దినాలు కల్పించి రూ.22.70 కోట్లను కూలీలకు రోజువారి వేతనంగా చెల్లించారు. మెటీరియల్ రూ.4.95 కోట్లు ఖర్చు చేశారు.

దినసరి వేతనం రూ.282

తుని నియోజవర్గంలో ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.282 లభిస్తుంది. ప్రభుత్వం రోజు వేతనం రూ.300 ప్రకటించినప్పటికీ నిర్దేశించిన కొలతలు పని చేయకపోవడంతో ఒక్కో మండలంలో ఒక్కో గ్రూపులో కూలీలకు వేర్వేరుగా వేతనం లభిస్తుంది. దినసరి వేతనం తుని మండలంలో రూ.280.95 పైసలు, తొండంగి మండలంలో 295.14 పైసలు, కోటనందూరు మండలంలో 270.01 పైసలు చొప్పున లభించింది. వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలు తుని మండలంలో 162, తొండంగిలో 117, కోటనందూరులో 123 కుటుంబాలు ఉన్నాయి.

1481 పనులు పూర్తి

మూడు మండలాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు 3032 పనులు చేపట్టి 1481 పనులను పూర్తి చేశారు. తుని మండలంలో 1371కి 602, తొండంగి మండలంలో 963కి 615, కోటనందూరు మండలంలో 962కి 698 పనులు వంద శాతం పూర్తి చేశారు.

మూడు మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులు :

మండలం	పూర్తయిన పని దినాలు	మంజూరైన పనులు	చేపట్టిన పనులు	కూలీలకు చెల్లించిన మొత్తం
తుని	368772	1973	1371	రూ.9.12 కోట్లు
తొండంగి	228881	1578	963	రూ.5.53 కోట్లు
కోటనందూరు	334573	962	698	రూ.8.05 కోట్లు
మొత్తం	9,32,226	4513	3032	రూ.22.70 కోట్లు

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఈనెలాఖరు నుంచి వాతావరణం అనుకూలిస్తుంది. జరుగుతున్న పనులతో పాటు కొత్త పనులను చేపట్టి మార్చి చివరికి లక్ష్యాన్ని చేరుకుంటాం. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను గరిష్టస్థాయి పెంచుతాం. గ్రామాల్లో పశువుల షెడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు పండ్ల తోటల్లో వర్షపు నీటి నిల్వకు, రైతు భూముల సరిహద్దుల్లో కందకాలు, ట్రెంచ్‌లు తవ్వకం పనులు చేయిస్తున్నాం. సీసీ రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణాలు 80 శాతానికి పైగా పూర్తయ్యాయి.

– పసనుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని



డి.పోలవరంలో సరిహద్దు భూముల్లో తవ్విన కందకాలు



ఎన్.సూరవరంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన పశువుల షెడ్డు

పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన

గండేపల్లి: స్థానిక జెడ్పీ స్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం సమగ్ర శిక్ష అభియాన్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వరి పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర అంశాలపై వివరిస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కేహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందినట్టు హెచ్‌సీ ముజువుద్దీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉప్పలపాడుకు చెందిన కోడినాగుల శ్రీనివాస్ రోజు మద్యం సేవిస్తున్నాడని భార్య దుర్గాదేవి మందలించింది. అంతేకాక అతను చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై బుధవారం పురుగు మందు సేవించాడు. కుటుంబ సభ్యులు చూసి వెంటనే కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్టు తెలియజేశారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో గురువారం సారా బట్టీలపై దాడి చేసి 500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈదాడిలో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిలో గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు... పి.నాయకంపల్లికి చెందిన అనిశెట్టి కృష్ణమూర్తి స్కూటీపై మురారి నుంచి వస్తు గండేపల్లిలో రోడ్డు దాటుతుండగా పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం నుంచి మరో మోటారు సైకిల్‌పై వస్తున్న రాయుడు గోవింద్, చందులు కృష్ణమూర్తి స్కూటీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి, చందులకు కాలుకు తీవ్ర గాయం కాగా, గోవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైవే, 108 అంబులెన్స్‌ల్లో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రెండు వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు సమీపాన సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. బంక్ సమీపంలోని పోలవరం కాలువ గట్టు లోపల ప్రదేశంలో అక్రమంగా సారా తయారీ చేస్తున్న స్థావరంపై గురువారం రాత్రి ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సిబ్బంది నిర్వహించిన ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 2వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముద్దాయిలను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రహదారులను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులు, రహదారుల పరిశీలన



వేములపాలెంలో రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ప్రత్తిపాడు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, వేములపాలెం, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. తొలుత ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం లంపకలోవ మీదుగా వేములపల్లి చేరుకుని గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దిపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వార్డులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచాలన్నారు. ఉత్తరకంచిలో పల్లె పండుగ పంచాయతీలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి దినం సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రత్తిపాడు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని, మండలానికి సంబంధించి వివిధ గ్రామాలను ఆనుకుని ఉన్న గిరిజన ఆవాసాలకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ప్రధానంగా గోకవరం, లంపకలోవ నుంచి రౌతుపాలెం, వేములపాలెం, పెద్దిపాలెం నుంచి ఉత్తరకంచి ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ డా.ఎస్.స్వప్న, ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్య అధికారి డా.డి.సౌమ్య, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నం రాజు, పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్య అధికారి డా.యశస్వీ కొండేపూడి, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్ సెంటర్ (సీహెచ్‌సీ)ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం తనిఖీ చేశారు. సీహెచ్‌సీలోని ఆక్సిజెన్ జనరేటర్, వార్డులు, ల్యాబ్, సీమాంక్ సెంటర్, గైనిక్, ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ యునిట్), చిన్న పిల్లల వార్డులు, వార్డులలోని మరుగుదొడ్లను పరిశీలించి, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డులో వైద్య సేవలు పొందుతున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. సీహెచ్‌సీ ద్వారా అందుతున్న వైద్య సేవలు, వైద్యుల ప్రవర్తన, భోజన వసతి తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. సీహెచ్‌సీలో రోగులకు ఆహారం తయారీని, వసతులను పరిశీలించారు. ఆహార తయారీ ప్రదేశంలో డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీహెచ్‌సీలో లోతట్టు ప్రదేశంలో నీటి నిల్వలు లేకుండా మెరకు చేయించాలంటూ ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబును ఆదేశించారు. 50 పడకలతో నిర్మిస్తున్న సీహెచ్‌సీ భవనం పరిస్థితిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సైన్సు ఇన్‌ఫ్రాటెక్చుర్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతన భవనం ఏప్రిల్ నాటికి పూర్తి చేయగలమని వారు కలెక్టర్‌కు తెలిపారు. జాతీయ రహదారిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సి వస్తోందని, ఆ పరిస్థితి లేకుండా ట్రామా కేర్ సెంటర్‌ను మంజూరు చేయాలని, పోస్టుమార్టమ్ గదికి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సూపరింటెండెంట్ సౌమ్య కోరారు. సాయంత్రం శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలోని అన్ని గదులను క్షుణంగా పరిశీలించి, కార్యాలయాన్ని మార్పు చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. నూతన భవన నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. తక్షణం మరో ప్రదేశం (భవనం)లోకి కార్యాలయాన్ని తరలించాలంటూ తహసీల్దార్ ఎం.సూర్యప్రభను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ స్వప్న, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, సీఐ బి.సూర్యఅప్పారావు, ఇంజినీరింగ్ అధికారులు సత్యప్రసాద్, రత్నరాజు, చక్రవర్తి, ఏపీఎం వెంకట్, ఏపీఓ కుమార్‌స్వామి, సీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద కలెక్టర్ షణ్మోహన్‌కు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ స్వాగతం పలికారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్ వేంచేసి ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మహోజ్వాల, రమణ సేవాశ్రమాలకు చెందిన బాబా మహదేవ్, స్వామి రామానంద ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఆయల ప్రధాన అర్చకులు చక్రవర్తుల రాఘవాచార్యులు(రఘు) చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించి భక్తులకు అందజేశారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రెడ్డి అన్నారు. మండల పరిధి ఠాకూర్‌పాలెంలో తహసీల్దార్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన హాజరయ్యారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాజీ సైనికుడు నగేష్‌ను సత్కరించిన ముద్రగడ



మాజీ సైనికుడు నగేష్‌ను అభినందిస్తున్న ముద్రగడ

కిర్లంపూడి: దేశ సరిహద్దుల్లో 18 సంవత్సరాల పాటు దేశరక్షణలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన సైనికుడు బందుల నగేష్‌కు గ్రామస్తులు, స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గురువారం రాత్రి భారీ ర్యాలీగా ముద్రగడ నివాసానికి చేరుకున్నారు. అక్కడ నాగేష్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు సత్కరించారు.

ముద్రగడ గిరిబాబు పరామర్శ



సుబ్బును పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: బైక్ ప్రమాదంలో గాయాలపాలైన వైఎస్సార్ సీపీ కార్యకర్త పీలా సుబ్రహ్మణ్యం(నాని)ను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. గురువారం చిల్లంగిలోని సుబ్రహ్మణ్యం నివాసానికి వెళ్లి జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాపేటి పెద్ద, పెంటకోట నాగబాబు, శరకణం సంతోష్, అడారి గంగబాబు, వేగి సాంబశివ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ చిన్నారావు



తొండంగిలో హెచ్ఎంలకు, ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

శంఖవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ ఎస్‌వీ రమణ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లకు పాఠశాల నిర్వహణ, అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండో ఎంఈఓ గోవింద్, సీఆర్పీలు దూడిపూడి రాజుబాబు, నాని పాల్గొన్నారు.

పిల్లలకు చక్కటి వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలి

కిర్లంపూడి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా విద్యా కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలు కృషి చేయాలని ఎంఈఓలు టి.జోషఫ్, మక్కా చిన్నారావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలు ఎంఈఓల అధ్యక్షతన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల నిర్వహణ, విధులు, బాధ్యతలు, పోక్సో చట్టాలపై ఆర్‌పీలు రమణ, సాయికృష్ణ అవగాహన కల్పించారు. స్థానిక వైఎంసీ చైర్మన్ ఆళ్ల బాబులు తదితరులు ఉన్నారు.

రౌతులపూడిలో..

రౌతులపూడి: మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎస్ఎమ్సీ(పాఠశాలల యాజమాన్య కమిటీ) సభ్యులకు గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంఈఓ–2 గాడి కొండబాబు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎమ్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తొండంగిలో..

తొండంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో మండలంలోని పాఠశాల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. రీసోర్సు పర్సన్లు పాఠశాలలో విద్యార్థుల రోల్స్, రెస్పాన్సిబిలిటీస్ అంశంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని కాకినాడ సమగ్రశిక్ష సీఎంఓ నాగేశ్వరరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ షేక్‌బాబ్జి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు. ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

హైందవ మహాసభను విజయవంతం చేయండి

ప్రత్తిపాడు రూరల్: ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం మహాసభకు విజయవంతం చేయాలని కోరుతూ ధర్మవరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గ్రామంలో రాజగోపాల్ స్వామి గుడి వద్ద నుంచి నంది సెంటర్, సినిమా హాల్ సెంటర్, కొత్తపేట తదితర ప్రాంతాల మీదుగా ర్యాలీ చేపట్టారు. హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని హైందవ మహాసభను విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు దొడ్డిపట్ల సోమన్నదొర, నక్కా శ్రీను, ఉప్పల తిరుపతిరావు, సానా నూకరాజు నాయుడు, జాగు సూర్యనారాయణ, సిద్ధపురెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రియా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తామరాడలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు

కిర్లంపూడి: కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రియా పోటీల్లో తామరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లఘు నాటికల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ విభాగం నుంచి ×అయ్యా నేను బడికి పోతా×కు ద్వితీయ స్థానం, సీనియర్ విభాగం నుంచి ×మాతృదేవోభవ×కు తృతీయ స్థానం సాధించారు. దీంతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన బావిశెట్టి లక్ష్మీనారాయణను పాఠశాల హెచ్ఎం ఎల్.కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ పేరూరి రాణి, గ్రామస్తులు గురువారం అభినందించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.